సిరిసిల్ల రూరల్: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతంలో నేలకూలిన భారీ మర్రి చెట్టు

చందుర్తి : ఈదురు గాలులతో లేచిపోయిన మల్యాల గ్రామానికి చెందిన కీర్తి వెంకటేశం ఇంటి రేకులు

భారీ వర్షం..

- ఉరుములు, మెరుపులతో వణికిన జనం
- ఈదురుగాలులతో లేచిపోయిన రేకులు
- జలమయమైన రహదారులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 4 (నమస్తే తెలంగాణ): జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులుతో కూడిన భారీ వర్షం పడింది. సిరిసిల్ల పట్టణంతోపాటు, తంగళ్లపల్లి, చందుర్తి, వేములవాడ, గంభీరావుపేట, ముస్తాబాద్, తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుతో కూడిన వర్షానికి పలు ఇళ్లపై కప్పులు లేచిపోయాయి. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్, నేతన్న చౌరస్తా, కుమార్‌గల్లీలు వర్షపు నీటితో జలమయమయ్యాయి. నేతన్న చౌక్ నుంచి పాతపెట్రోల్ పంపు వరకు రోడ్డుపై నీరు నిలిచిపోయింది. రోడ్డుపక్కన ఉన్న వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డుపైన మురికి కాలువలోని పూడికమట్టి రోడ్లపైకి చేరడంతో వచ్చేపోయే వారంతా ఇబ్బంది పడ్డారు. ఈప్రాంతంలో నీటి నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా తీవ్ర వేసవితాపంతో అల్లాడుతున్న జనం వర్షంతో పాటు చల్లని గాలులతో ఉపశమనం పొందారు. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా రెండు సెంటీమీటర్ల వర్షం పడినట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో కురుస్తున్న వర్షం

వర్షంలో వెళ్తున్న ప్రజలు

సిరిసిల్ల టౌన్, జూన్ 4: సిరిసిల్ల పట్టణంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పాతబస్టాండ్ నుంచి పెద్దబజార్ వెళ్లే దారితో పాటు నేతన్న చౌక్, సంజీవయ్య నగర్ కమాన్ ప్రాంతాల్లో రోడ్లపై వర్షంనీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సిరిసిల్ల రూరల్, జూన్ 4: తంగళ్లపల్లి మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంతంలో ఈదురుగాలులకు భారీ మర్రి చెట్టు నేలకూలింది. వర్షంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

చందుర్తి, జూన్ 4: మండలంలోని ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో వర్షం కురిసింది. మండల కేంద్రంలో కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిపై ఈదురు గాలులకు చెట్లు నేలకూలడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. గ్రామస్తులు చెట్లను తొలగించి రహదారిని పునరుద్ధరించారు. మల్యాల గ్రామానికి చెందిన కీర్తి వెంకటేశం రేకుల షెడ్డు ఈదురగాలికి ఎగిరిపోయి సమీపంలో ఉన్న పాఠశాల మైదానంలో పడిపోయాయి. మర్రి గడ్డలో తాటిచెట్టు విరిగిపడి కరెంటు స్తంభాలపై పడడంతో సుమారు గంటపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

వీర్నపల్లి, జూన్ 4: మండల వ్యాప్తంగా సుమారు నాలుగు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి జనాలు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. బాబాయిచెరువుతండాలో భూక్యా జగన్‌కు చెందిన గడ్డివాముపై పిడుగు పడి దగ్ధమైంది. రూ.20వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

చందుర్తి : ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోరుట్ల వేములవాడ రహదారిపై విరిగిపడ్డ చెట్లు

వీర్నపల్లి : పిడుగుపడి దగ్ధమవుతున్న గడ్డివాము

సిరిసిల్ల అర్బన్ ఎన్నికల ప్రచారంలో తంగళ్లపల్లి నేతలు

సిరిసిల్లలో అర్బన్ ఎన్నికల ప్రచారం చేస్తున్న తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్ల రూరల్, జూన్ 4: సిరిసిల్లలో అర్బన్ ఎన్నికల ప్రచారంలో తంగళ్లపల్లి మండల బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారు. స్థానిక కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్,లింగంపల్లి సత్యనారాయణతో కలిసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల కోసం ప్రచారం నిర్వహించారు. ఈనెల 6న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని, ఓటర్లను కలిసి అభ్యర్థించారు. వీరిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పడిగెల రాజు, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణా రెడ్డి, పోచవేని ఎల్లయ్య యాదవ్, జాగృతి మండలాధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, స్థానిక నేతలున్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

కోనరావుపేటలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు

కోనరావుపేట, జూన్ 4: ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించగా, హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో ఆశ కార్యకర్తలు మెరుగైన సేవలందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. ఇక్కడ మండల వైద్యాధికారి వేణుమాధవ్, సీహెచ్‌వో బాలచంద్రం, సూపర్‌వైజర్లు శ్రీదేవి, రషీద్, ఎంహెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మకు ఘనంగా బోనాలు

అమ్మవారి దర్శనం కోసం నిలబడ్డ భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 4 : రాజన్న అనుబంధ ఆలయమైన శ్రీ బద్దిపోచమ్మకు భక్తులు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో బోనం సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ పురవీధుల గుండా ఊరేగింపుగా బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు అమ్మవారికి కల్లుపోసి, సారెపెట్టి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనం సమర్పించడానికి భక్తులు క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అనుబంధ దేవాలయాల పర్యవేక్షకులు హరిహరనాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మండల స్థాయి కబడ్డీ పోటీలు

ఇల్లంతకుంట, జూన్ 4 : మండల కేంద్రంలో ఈనెల 7,8న మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ జన్మదినం పురస్కరించుకుని టీంవీకేఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి కబడ్డీ పోటీలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తారని తెలిపారు. మొదటి బహుమతి రూ.5,555, ద్వితీయ బహుమతి రూ.3,333 అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పీఈటీ సాన బాబు 9440350422, మామిడి శ్రీనివాస్ 9966374646, వెంకటేశ్ 7997701580లలో సంప్రదించాలని కోరారు.

మద్యం పట్టివేత.. ఇద్దరిపై కేసు నమోదు

పట్టుకున్న మద్యంతో సీఐ ముస్తాఫా

సిరిసిల్ల రూరల్/బోయినపల్లి, జూన్ 4: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సమయంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల ఎక్సైజ్ సీఐ ముస్తాఫా తెలిపారు. సిరిసిల్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని బోయినపల్లి మండలం కోరెం, వెంకట్రావుపల్లెలో మద్యం దుకాణాలు మూసివేసిన అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు చేశారు. ఇద్దరిని పట్టుకొని వారి వద్ద మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇక్కడ ఎస్ఐ ప్రణీత్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ మాజిద్, మధు, ఏ శ్రీను, జీ శ్రీను సిబ్బంది ఉన్నారు.

డిజిటల్ స్క్రీన్‌పై లోక్‌సభ ఫలితాల ప్రదర్శన

డిజిటల్ స్క్రీన్‌పై ఫలితాలు వీక్షిస్తున్న బాటసారులు

కలెక్టరేట్, జూన్ 4 : లోక్‌సభ ఎన్నికల ఫలితాలను కలెక్టరేట్ ఎదుట డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించగా, బాటసారులు ఎన్నికల ఫలితాలు ఆసక్తి వీక్షించారు. లెక్కింపు కేంద్రాలతో పాటు కలెక్టరేట్‌ల ఎదుట కూడా ఫలితాల లైవ్ ప్రదర్శించాలంటూ ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు ఆదిశగా ఏర్పాట్లు చేశారు. లెక్కింపు ప్రారంభమైన ప్పటి నుంచి మొదలు పూర్తయ్యేవరకు స్క్రీన్‌పై లైవ్ ప్రసారం చేయడంతో కలెక్టరేట్ ఎదుట నుంచి వెళ్లే పలువురు ఆగి, ఫలితాలను ఆసక్తిగా తిలకించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

CHANGE OF NAME

★ I SUDHEER KUMAR.M s/o: MEKALA ODELU, R/o: H.No. 1-85/1, Potharam Village, Mutharam Manthani mandal, Peddapalli dist, Telangana state, corrected as my father name MEKALA ODELU @ ODELU MEKALA in place of ODELU, for all purpose.
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, మే 4: రాస్తారోకోల పేరుతో రోడ్ల మీదకు వచ్చి ప్రజా రవాణా, శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప, రాస్తారోకోల పేరుతో రోడ్ల మీదకు వచ్చి ప్రజా రవాణాకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్లలో 9 కేసుల్లో 52 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఏవైనా సమస్యలుంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎస్పీ సూచించారు.

పాలిసెట్‌లో ర్యాంకు

ఎల్లారెడ్డిపేట, జూన్ 4 : మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి చింత రిశ్వంత్ పాలిటెక్నిక్ ఫలితాల్లో 191వ ర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్ ఎండీ లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ అంతరాయం

రుద్రంగి, జూన్ 4: రుద్రంగి మండల కేంద్రంలో రోడ్ వైండింగ్ మెయింటనెన్స్ కారణంగా బుధవారం రుద్రంగిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చందర్తి సెస్ ఏఈ మహేశ్ ప్రకటనలో తెలిపారు. రోడ్ వైండింగ్ మెయింటనెన్స్ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ మహేశ్ కోరారు.

ఉపాధి కూలీకి అస్వస్థత

వీర్నపల్లి, జూన్ 4 : ఉపాధి హామీ కూలీకి వడదెబ్బ తాకగా అస్వస్థతకు గురైంది. మండలంలోని గర్జనపల్లికి చెందిన చిన్నం చంద్రవ్వ రోజూలాగానే ఉపాధి హామీ పనికి మంగళవారం వెళ్లింది. పనిచేస్తున్న సమయంలో వడదెబ్బకు గురై కిందపడినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు గమనించి 108లో జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. చంద్రవ్వ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

పశు గ్రాసం దగ్ధం

ఇల్లంతకుంట, జూన్ 4 : మండలంలోని రేపాక గ్రామంలో ప్రమాదవశాత్తూ పశు గ్రాసం మంగళవారం సాయంత్రం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు గొల్ల యాదగిరి చెందిన గడ్డి కట్టలు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయని తెలిపారు. గ్రామస్తులు వెంటనే స్పందించి నీళ్లు చల్లగా అప్పటికే నష్టం జరిగి పోయిందని తెలిపారు.

ప్రమాదకరంగా లోలెవల్ వంతెన

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కల్వర్టులో కింద పడి లేచి వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు

కోనరావుపేట, జూన్ 4: మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై ఉన్న లోలెవల్ వంతెన ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల నుంచి కోనరావుపేటకు వచ్చే ప్రధానరోడ్డులో ఉన్న లోలెవల్ వంతెనపై మల్కపేట రిజర్వాయర్ తూంలో నుంచి వచ్చే వృథానీరు నిత్యం పారుతుండడంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నీరు నిత్యం పారడంతో వంతెనపై పెద్ద గుంత ఏర్పడింది. వాహనదారులు గమనించక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రానికి పనుల నిమిత్తం వచ్చేవారికి ఇబ్బందిగా మారింది. అధికారులు నీటి వృథాను అరికట్టి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

లారీల అడ్డదారులు

- టోల్ రుసుము తప్పించుకునేందుకు పల్లెల మీదుగా పెరుగుతున్న రాకపోకలు
- గ్రామాల్లో తరచూ ప్రమాదాలు.. భయాందోళనలో గ్రామీణులు
- పట్టింపు లేని హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా నిర్వాహకులు

గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన లారీ (ఫైల్)

రాజీవ్ రహదారి వెంబడి ఉన్న టోల్ ప్లాజాను తప్పించుకునేందుకు లారీలు అడ్డదారులు పడుతున్నాయి. రోజూ పదుల సంఖ్యలో పల్లెల మీదుగా వేగంగా సింగిల్ రోడ్డుపై దూసుకెళ్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన హెచ్‌కేఆర్ టోల్ ప్లాజా యాజమాన్యం, సిబ్బంది పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- తిమ్మాపూర్, జూన్ 4

తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై హెచ్‌కేఆర్ సంస్థ టోల్‌ప్లాజా ఉన్నది. ఈ క్రమంలో హైదరాబాద్ –కరీంనగర్ వైపుగా అటూ ఇటూ వెళ్లే వాహనాలు తప్పనిసరిగా టోల్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అయితే చాలా వాహనాలు ముఖ్యంగా పెద్ద లారీలు, రుసుము తప్పించుకునేందుకు రేణికుంట స్టేజీ నుంచి గొల్లపల్లి, నేదునూర్, లక్ష్మీదేవిపల్లి మీదుగా గుండ్లపల్లికి చేరుకుని అక్కడి నుంచి తిరిగి రాజీవ్ రహదారి పైకి చేరుకుంటున్నాయి. రహదారి మీదుగా నేరుగా వెళ్లి తిరిగి వచ్చే పెద్ద లారీలు టోల్ ప్లాజాలో రూ.750 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుసుం తప్పించుకునేందుకు లారీలతోపాటు కార్లు, ఇతర వాహనాలు ఆయా గ్రామాల వెంట వెళ్తుంటాయి.

తరచూ ప్రమాదాలు.. రాకపోకలు ఇబ్బందులు

టోల్ రుసుం తప్పించుకోవడానికి లారీలు గ్రామాల మీదుగా సింగిల్ రోడ్డుపై వెళ్తుండగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ముందు లారీ వెళ్తే మరే వాహనమైనా సైడ్ దొరుకక వెనుకాలే ప్రయాణించాల్సిన వస్తున్నది. దీంతో గ్రామాలకు వెళ్లే వాహదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల మీదుగా వెళ్తున్న క్రమంలో లారీల వల్ల పలు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. వారం క్రింద టోల్‌తప్పించుకునేందుకు వెళ్లిన లారీ గొల్లపల్లి గ్రామం వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో పదుల సంఖ్యలో టీవీలు పాడైపోయాయి. అలాగే ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కారును అడ్డదారిన వస్తున్న లారీ ఢీకొట్టడంతో కారు ధ్వంసం కాగా, త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇలాంటి ఘటనలు రోజు అనేకం జరుగుతున్నాయి. లారీలు టోల్ రుసుం తప్పించుకునేందుకు గ్రామాల వెంట వెళ్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నా.. టోల్‌ప్లాజా యాజామాన్యం చోద్యం చూస్తున్నది. లారీలు ఇతర మార్గాల వెంట వెళ్లకుండా కట్టడి చేయలేక పోతున్నారు. వారి ఆదాయానికి గండి పడడం దేవుడెరుగు.. కానీ ప్రజల ప్రాణాలతో లారీలు, టోల్ ప్లాజా చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లారీలను కట్టడి చేయాలి

గతంలో లారీలు రాత్రి సమయంలో మాత్రమే మా ఊరి మీదికెళ్లి పోయేవి. రాత్రి కాబట్టి ఇబ్బందులేం ఉండకపోవు. కానీ ఇప్పుడు పగలు కూడా పోతున్నాయి. దీంతో మా గ్రామస్తులకే కాకుండా ఇతర గ్రామాల ప్రజలకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నయ్. అలాగే పలు ప్రమాదాలు కూడా జరిగినయి. అయినా టోల్ ప్లాజా యాజమాన్యం గానీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. మా గ్రామం మీదుగా లారీలు, ఇతర వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి.

–మల్లెత్తుల అంజయ్య, గొల్లపల్లి మాజీ సర్పంచ్